
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

బుధవారం । 13 । నవంబర్ । 2024



సోమశిలలో 68.377 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో మంగళవారానికి 68.377 టీఎంసీలు ఉన్నాయి. ఎగువ నుంచి 5,850 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా డెల్టాకు 2,150, ఉత్తరకాలువకు 700, కండలేరుకు 2,600, దక్షిణకాలువకు 400 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.77,190
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.7,024
మూడు శాతం జీఎస్టీతో	రూ.7,235
సవర (8 గ్రాములు)	రూ.57,880

గరిష్టం/కనిష్టం
26.8 /24.9

వాతావరణం

జిల్లాలో బుధవారం ఆకాశం మేఘావృతంగా ఉంటుంది. అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ 100 శాతం ఉంది.

న్యూస్‌రీల్

లైంగికదాడి కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు

నెల్లూరు(లీగల్): మైనర్ బాలిక (13)కు మాయమాటలు చెప్పి లైంగిక దాడికి పాల్పడిన కేసులో నేరం రుజువు కావడంతో పూర్వ నెల్లూరు జిల్లా చిల్లకూరు మండలం బూదనం గ్రామానికి చెందిన కావూరు మస్తాన్‌బాబుకు 20 సంవత్సరాలు జైలుశిక్ష, రూ.23 వేలు జరిమానా విధిస్తూ నెల్లూరు పోక్సో ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి సిరిపిరెడ్డి సుమ మంగళవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు బూదనం గ్రామానికి చెందిన మైనర్ బాలిక స్థానిక పాఠశాలలో చదువుకుంటోంది. అదే గ్రామానికి చెందిన నిందితుడు మస్తాన్‌బాబు ఆ బాలికకు మాయమాటలు చెప్పి దగ్గరలో ఉన్న ట్యాంకు వద్దకు 2021 ఫిబ్రవరి 18 మధ్యాహ్నం తీసుకువెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. మరుసటి రోజు బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు చిల్లకూరు పోలీసులు కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. విచారణలో మస్తాన్ బాబుపై నేరం రుజువుకావడంతో పైమేరకు శిక్ష, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున స్పెషల్ పీపీ దువ్వూరు శైలజారెడ్డి వాదించారు.

ట్రెయినీ ఐఏఎస్‌ల పరిశీలన



పారిశుద్ధ్య నిర్వహణ, స్వచ్ఛభారత్ విధానాన్ని తెలుసుకుంటున్న ట్రెయినీ ఐఏఎస్‌లు

నెల్లూరు(బారకాసు): అర్బన్ ఫీల్డ్ విజిట్ రెండు రోజుల శిక్షణలో భాగంగా ట్రెయినీ ఐఏఎస్‌లు మంగళవారం నగరంలోని పలు ప్రాంతాల్లో పారిశుద్ధ్య నిర్వహణను వీక్షించారు. భక్తవత్సలనగర్‌లోని నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలలో విద్యాబోధన విధానాన్ని ఉపాధ్యాయుల ద్వారా తెలుసుకున్నారు. జాకీర్‌హుస్సేన్‌నగర్ ప్రాంతంలో మురికివాడల్లో నివసించే ప్రజల జీవన విధానాన్ని, స్వచ్ఛభారత మిషన్‌ను పరిశీలించారు. వారికి అదనపు కమిషనర్ వైకె నందన్ వివరించారు. వారి వెంట టీపీఆర్వో బాలకృష్ణ, ఇతర సిబ్బంది ఉన్నారు.

డీఎస్సీ ఎస్‌జీటీలకు ఉచిత శిక్షణ

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): డీఎస్సీ (సెకండరీ గ్రేడ్ టీచర్స్) పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు ఏపీ బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో ఉచిత కోచింగ్ ఇవ్వనున్నామని బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. టీటీసీ, టెట్ పూర్తి చేసిన జిల్లాకు చెందిన బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ అభ్యర్థులు అర్హులన్నారు. రూ.లక్ష లోపు వార్షిక ఆదాయం ఉండాలన్నారు. మెరిట్ ప్రాతిపదికన ఎంపిక చేసిన 100 మందికి 60 రోజుల పాటు ఉచిత శిక్షణతో పాటు స్టడీమెటీరియల్, స్టైఫండ్ కూడా ఇస్తామన్నారు. ఆసక్తి కలిగిన వారు తమ పదో తరగతి, ఇంటర్, టీటీసీ మార్కుల జాబితా జిరాక్స్‌లతో పాటు టెట్ జాబితా, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు ఆధార్‌కార్డు, పాన్‌కార్డు, బ్యాంకు అకౌంట్ పాస్‌బుక్ జిరాక్స్‌లతో పాటు రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలు జత చేసి అందజేయాలన్నారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని శోధన్‌నగర్ రోడ్డు–సోమశేఖరపురంలో ఉన్న ఏపీ బీసీ స్టడీ సర్కిల్ కార్యాలయంలో ఈ నెల 14లోపు దరఖాస్తులను అందజేయాలని కోరారు. ఆ తర్వాత వచ్చిన దరఖాస్తులు పరిశీలన చేయబోమన్నారు. వివరాలకు 93815 54779, 93902 39588 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

రాళ్లపాడు ఆయకట్టుకు సాగునీరు విడుదల



రాళ్లపాడు కుడి కాలువకు నీరు విడుదల చేస్తున్న ఎమ్మెల్యే

లింగసముద్రం: రాళ్లపాడు ఆయకట్టు పరిధిలో కుడి, ఎడమ కాలువలకు కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు మంగళవారం పూజలు నిర్వహించి నీటిని విడుదల చేశారు. కుడి కాలువకు 15 క్యూసెక్కులు, ఎడమ కాలువకు 5 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రాజెక్ట్ ఆయకట్టు పరిధిలో వరి పంటకు నీరిస్తామని రైతులు వరినార్లు పోసుకునేలా సన్నద్ధం కావాలన్నారు. సోమశిల జలాశయం నుంచి 1.5 టీఎంసీ నీటిని రాళ్లపాడుకు తీసకువస్తానని హామీ ఇచ్చారు. వర్షాలు కురుస్తున్నందున ప్రాజెక్టుకు పూర్తి స్థాయిలో నీరు చేరుతోందన్నారు. ఒంగోలు సర్కిల్ ఎస్ఈ వరలక్ష్మి, ప్రాజెక్ట్ డీఈలు, జేఈలు పాల్గొన్నారు.



రామలింగాపురం అండర్‌బ్రిడ్జిలో నీటిలో చిక్కుకున్న కారును నెట్టుకుంటూ బయటకు తీసుకువస్తున్న పోలీసులు

అండర్ బ్రిడ్జిలో చిక్కుకున్న కారు

నెల్లూరు (క్రైమ్): సోమవారం అర్ధరాత్రి నుంచి కురిసిన వర్షానికి నగరంలోని రామలింగాపురం అండర్ బ్రిడ్జిలో భారీగా నీరు చేరుకుంది. మంగళవారం తెల్లవారుజామున సుమారు 3 గంటలకు ఓ కుటుంబం కారులో రామలింగాపురం అండర్ బ్రిడ్జి ద్వారా నగరంలోకి వస్తుండగా అందులోని నీటిలోతును గుర్తించలేకపోవడంతో కారు నీటిలో చిక్కుకుంది. బాధితులు డయల్ 112కు సమాచారం అందించగా కంట్రోల్ రూమ్ సిబ్బంది రాత్రి గస్తీ విధుల్లో ఉన్న నవాబుపేట ఇన్‌స్పెక్టర్ అన్వర్‌బాషాను అప్రమత్తం చేశారు. ఆయన తన సిబ్బందితో వచ్చి సురక్షితంగా బయటకు తీసుకువచ్చారు.



ఫైళ్లకు రక్షణగా ప్లాస్టిక్ పట్టలను కప్పి విధులు నిర్వర్తిస్తున్న కలెక్టరేట్ ఉద్యోగులు

వాన పడితే పరదాలే ఫైళ్లకు రక్ష

నెల్లూరు(అర్బన్): చిన్నపాటి వర్షాలకు సైతం పలు ప్రభుత్వ కార్యాలయాలు ఉరుస్తూ ఉంటాయి. వాటిని సరిచేసేందుకు నిధులు లేక అధికారులు ఇబ్బందులు పడుతుంటారు. అయితే జిల్లా పాలనకు కేంద్ర బిందువైన కలెక్టరేట్‌లో సైతం మంగళవారం ఇలాంటి పరిస్థితే కనిపించింది. నగరంలో కురుస్తున్న వర్షాలకు కలెక్టర్ కార్యాలయంలో సైతం లీకేజీలు ఏర్పడ్డాయి. అక్కడక్కడ వర్షపు నీటి బిందువులు పడుతుండటంతో ఒక సెక్షన్‌లోని ఫైళ్లు తడిచి పోకుండా ప్లాస్టిక్ పట్టలు కప్పారు. ఆ పరదాల మాటునే అధికారులు తమ విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ దృశ్యాన్ని 'సాక్షి' క్లిక్ మనిపించింది.

వాన ముసుగు

జిల్లాపై అల్పపీడన ద్రోణి తీవ్ర ప్రభావం

- గత అర్ధరాత్రి నుంచి ఎడతెరిపిలేని వర్షం
- నిండుకుండలా సోమశిల, కండలేరు
- ఏ క్షణంలో అయినా సోమశిల నుంచి నీటి విడుదల
- పెన్నానది దిగువ ప్రాంతాలను అప్రమత్తం చేసిన అధికారులు



నెల్లూరు నగరంలోని వీఆర్‌సీ సెంటర్‌లో చిన్నపాటి చినుకులకే జలమయమైన రోడ్డు

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంగా జిల్లా వ్యాప్తంగా సోమవారం అర్ధరాత్రి నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో జిల్లా వ్యాప్తంగా ఎక్కడికక్కడ జనజీవనం స్తంభించింది. పలు చోట్ల వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. పట్టణ, నగర ప్రాంతాల్లోనూ డ్రెయిన్లు పొంగి పొర్లుతున్నాయి. వాతావరణ శాఖ హెచ్చరికలు, భారీ వర్షాల పరిస్థితిని దృష్టిలో ఉంచుకున్న జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. ఎక్కడికక్కడ ముందస్తు జాగ్రత్త చర్యల్లో నిమగ్నమైంది. ముఖ్యంగా నెల్లూరు, కావలి పట్టణాల్లో లోతట్టు ప్రాంతాల్లో ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. నెల్లూరు నగరంలో రాకపోకలకు ఇబ్బంది లేకుండా ప్రధానమైన ఆత్మకూరు బస్టాండ్, విజయ్ మహల్ గేట్, రామలింగాపురం అండర్ బ్రిడ్జి, మాగుంట లేఅవుట్ అండర్ బ్రిడ్జిల్లో నీరు నిలవకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నారు. ఇటీవల భారీ వర్షాలతో సమృద్ధిగా జలాశయాల్లోకి నీరు చేరడంతో ప్రధానమైన సోమశిల, కండలేరు, దిగువన ఉన్న కనిగిరి, నెల్లూరు సర్వేపల్లి, చిన్నక్రాక బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లు సహా అన్ని జలవనరులు నిండుకుండలా ఉన్నాయి. సోమశిలకు భారీ వరద వచ్చే అవకాశం ఉండడంతో ఏ క్షణంలోనైనా పెన్నానదికి నీటిని విడుదల చేసే అవకాశాలు ఉండడంతో పెన్నానది దిగువ ప్రాంతాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు.

అత్యధికంగా దగదర్తిలో 82.4 మి.మీ.

- **అత్యల్పంగా వరికుంటపాడులో 2.2 మి.మీ.**

నెల్లూరు (అర్బన్): నెల్లూరు నగరంలో ఎడతెరపి లేకుండా తేలికపాటి జల్లులు కురుస్తున్నాయి. నగరంలో పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఆర్టీసీ కాలనీ, తల్పగిరి కాలనీ, మనుమసిద్ధినగర్, టీచర్స్ కాలనీ, జయలలిత నగర్ తదితర ప్రాంతాల్లో వర్షపు నీరు ఇళ్ల చుట్టూ చేరిపోయింది. పలు ఖాళీ ప్లాట్లలో నీరు నిలబడిపోయింది. మంగళవారం సాయంత్రం 6 గంటల వరకు జిల్లాలో కురిసిన వర్షపాతాన్ని పరిశీలిస్తే అత్యధికంగా దగదర్తి మండలంలో 82.4 మి.మీ., అత్యల్పంగా వరికుంటపాడులో 2.2 మి.మీ. వర్షపాతం నమోదైంది. అల్లూరులో 70.6, బోగోలు మండలంలో 70.0, కావలి 66.0, జలదంకి 57.2, బుచ్చిరెడ్డిపాళెం 48.4, సంగం 48.4, గుడ్లూరు 46.6, లింగసముద్రం 41.4, కొండాపురం 41.0, కోవూరు 39.6, కొడవలూరు 33.6, సైదాపురం 33.6, వింజమూరు 33.2, నెల్లూరు అర్బన్ 33.0, విడవలూరు 31.8, కందుకూరు 31.2, ఉలవపాడు 30.0, అనుమసముద్రంపేట 29.0, పొదలకూరు 24.2, ఇందుకూరుపేట 21.8, ఆత్మకూరు 21.0, నెల్లూరు రూరల్ 19.0, తోటపల్లిగూడూరు 17.2, చేజర్ల 16.6, వెంకటాచలం 13.8, వలేటివారిపాళెం 11.6, మనుబోలు 10.6, ముత్తుకూరు 10.4, రాపూరు 8.4, కలువాయి 8.0, అనంతసాగరం 5.6, కలిగిరి 5.6, దుత్తలూరు 4.2, సీతారామపురం 4.2, మర్రిపాడు 3.6, ఉదయగిరి 3.0 మి.మీ వర్షం కురిసింది. ఈ సీజన్‌లో ఇప్పటి వరకు కొన్ని మండలాల్లో తగిన వర్షపాతం నమోదు కాగా, మరికొన్ని మండలాల్లో అదనపు వర్షం కురి సింది. అయితే 4 మండలాల్లో ఇప్పటికీ లోటు వర్షపాతం ఉంది. అనుమసముద్రంపేటలో 24.9 శాతం తక్కువ వర్షం కురిసింది. వలేటివారిపాళెం 23.3, రాపూరు– 26.9, దుత్తలూరులో 22.9 లోటు వర్షపాతం ఉంది.

మరో రెండు రోజులు వర్షాలే

నెల్లూరు(అర్బన్): నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం తమిళనాడు, సరిహద్దు దక్షిణ ఆంధ్రప్రదేశ్ తీర ప్రాంతంలో కొనసాగుతున్న దృష్ట్యా రాయలసీమతో పాటు నెల్లూరు జిల్లాలో మరో రెండు రోజులు తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఒకటి, రెండు చోట్ల భారీ వర్షాలు నమోదవుతాయని వివరించింది. కొన్ని చోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన జల్లులు కురుస్తాయంది.

టీడీపీ నేత బరితెగింపు

- మహిళపై బూతులతో రెచ్చిపోయిన వైనం
- సోషల్ మీడియాలో ఆడియో వైరల్

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: తాను చేసే బియ్యం వ్యాపారంలో కలుగజేసుకుంటున్నదని ఓ మహిళపై కందుకూరు పట్టణ టీడీపీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు తీవ్రస్థాయిలో రెచ్చిపోయాడు. పత్రికల్లో రాయలేని భాషలో బూతులు తిడుతూ, కనిపిస్తే పెట్రోల్ పోసి తగలబెడతానంటూ బెదిరింపులకు పాల్పడ్డాడు. నాలుగు రోజుల క్రితం జరిగిన ఈ ఘటనకు సంబంధించి ఆడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. గుడ్లూరు మండలానికి చెందిన ఓ మహిళ కందుకూరులో నివాసం ఉంటోంది. ఆమె కొన్నేళ్లుగా బియ్యం వ్యాపారం చేసుకుంటూ తన ఇద్దరు కుమారులను చదివించుకుంటోంది. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత బియ్యం వ్యాపారం మొత్తం ఆ పార్టీ నాయకుల గుత్తాధిపత్యం కిందకు వెళ్లింది. బియ్యం వ్యాపారానికి బాస్‌గా ఉన్న మల్లేశ్వరరావు పట్టణంలో ఒక్క బియ్యపు గింజ కూడా వేరే వాళ్లకి వెళ్లడానికి లేదని డీలర్లపైన ఆంక్షలు పెట్టాడు. ఈ నేపథ్యంలో నాలుగు రోజుల క్రితం ఆమె పట్టణంలోని ఓ డీలర్ వద్ద బియ్యం కొనుగోలు చేసి తరలించేందుకు ఆటోను ఏర్పాటు చేసుకుంది. ఈ విషయం తెలుసుకున్న మల్లేశ్వరరావు నా సామ్రాజ్యంలో బియ్యం కొనడానికి ఎవరంటూ బూతులతో రెచ్చిపోయాడు. రాయడానికి వీలులేని బూతు పదాలతో మండిపడ్డాడు. అంతటితో ఆగకుండా ఇంకోసారి టౌన్‌లో ఎక్కడా బియ్యం కొన్నట్లు తెలిసినా, మీ ఆటో వచ్చినా పెట్రోల్ పోసి తగలబెడతానంటూ తీవ్ర బెదిరింపులకు దిగాడు.

భర్త చేతిలో భార్య దారుణహత్య

బిట్రగుంట: బోగోలు మండలం విశ్వనాథరావుపేటలో భర్త చేతిలో భార్య దారుణ హత్యకు గురైన ఘటన మంగళవారం రాత్రి జరిగింది. అనుమానం పెనుభూతంగా మారి భర్త పాశవికంగా కత్తితో దాడి చేయడంతో భార్య జలచిత్ర తస్లీమా (38) అక్కడికక్కడే మృతి చెందింది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు విశ్వనాథరావుపేటకు చెందిన జలచిత్ర తస్లీమా, దత్తాద్రి భార్యాభర్తలు. కుటుంబ కలహాలు, అనుమానం నేపథ్యంలో కొద్ది రోజులుగా భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో మంగళవారం రాత్రి కూడా మరో మారు భార్యాభర్తలు గొడవపడగా దత్తాద్రి భార్య తస్లీమాపై కత్తితో విచక్షణా రహితంగా దాడి చేసి పారిపోయాడు.



తస్లీమా మృతదేహం



వివరాలు సేకరిస్తున్న డీఎస్పీ శ్రీధర్

తీవ్రంగా గాయపడిన తస్లీమా అక్కడికక్కడే మృతి చెందింది. సమాచారం అందుకున్న వెంటనే కావలి డీఎస్పీ శ్రీధర్, బిట్రగుంట ఎస్సై భోజ్యా ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి స్థానికులు, మృతురాలి కుమారుడిని విచారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు. పరారీలో ఉన్న భర్త దత్తాద్రి కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

జీజీహెచ్‌లో కుర్చీల కోసం వార్

- తన కుర్చీ తీసేశారంటూ ఓ డాక్టర్ నిరసన
- ఇన్‌చార్జి హెచ్‌ఓడీపై ఆరోపణలు



డాక్టర్ సుకుమార్‌తో మాట్లాడుతున్న పీజీ కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ నరేంద్ర తదితరులు

నెల్లూరు(అర్బన్): నెల్లూరులోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో కుర్చీల విషయమై వైద్యుల మధ్య వివాదం నెలకొంది. తాను వినియోగిస్తున్న ఒక కుర్చీని తీసేశారంటూ ఈఎన్టీ డాక్టర్ ఇన్‌చార్జి హెచ్‌ఓడీకి వ్యతిరేకంగా మంగళవారం నిరసన తెలిపారు. ఇందులో భాగంగా నేలపై కూర్చొని వైద్యసేవలందించారు. ఇద్దరు డాక్టర్ల మధ్య నడుస్తున్న వివాదం వల్ల రోగులకు వైద్య సేవలు ఆలస్యమయ్యాయి. ఈ సందర్భంగా నిరసన తెలుపుతున్న చెవి, ముక్కు, గొంతు డాక్టర్ సుకుమార్ మాట్లాడుతూ తనను హెచ్‌ఓడీ శ్రీదేవి వేధిస్తున్నట్లు ఆరోపించారు. ఆమె సక్రమంగా విధులకు రావడం లేదన్నారు. తాను పేదలకు అరుదైన ఆపరేషన్లు చేయడంతో ఈ విషయం పత్రికల్లో ప్రచురితమైనట్లు చెప్పారు. అప్పటి నుంచి ఆమె అసూయ పెంచుకున్నారని వెల్లడించారు. అడ్మిట్ చేసిన కేస్ షీట్‌లో సైతం తన పేరు కొట్టేసి ఆమె పేరు రాసుకున్నట్లు చెప్పారు. యూనిట్ విధానాన్ని మార్చేయడంతో అసిస్టెంట్ ప్రొఫెసర్ మీద బాధ్యతలు తోసేసి ఆమె విధులకు సక్రమంగా రావడం లేదని, 12 గంటల తర్వాత ఓపీలో ఉండటం లేదని ఆరోపించారు. ఈ విషయాలను సూపరింటెండెంట్‌కు చెప్పినా స్పందించలేదన్నారు. తాను ఒకటిన్నర సంవత్సరంగా వాడుతున్న రివాల్వింగ్ కుర్చీని ఇప్పుడు ఆమె లాక్కొనడంతో నిరసన తెలుపుతున్నానన్నారు.

నేను విధులకు వస్తున్నా..

ఈ విషయమై డాక్టర్ శ్రీదేవి మాట్లాడుతూ ఆ కుర్చీ ఆ డాక్టర్ మాత్రమే వాడాలని లేదు కదా అన్నారు. తాను హెచ్‌ఓడీ కాబట్టి తీసుకున్నానన్నారు. ఆయనకు ఎస్ టైపు కుర్చీ ఉందని తెలిపారు. తాను విధులకు సక్రమంగానే వస్తున్నానన్నారు. వైద్య విద్యార్థులకు యూజీ క్లాసులను చెప్పేందుకు ఒక గంట మాత్రమే ఓపీలో ఉండటం లేదని వెల్లడించారు. డాక్టర్ సుకుమార్ తనపై అనవసరమైన ఆరోపణలు చేస్తున్నారని వాపోయారు. నిరసన విషయం తెలుసుకున్న ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ కాలేషాబాషా, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ మస్తాన్‌బాషా, పీజీ వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ నరేంద్ర, అడ్మిన్ అధికారులు డాక్టర్ కళారాణి, డాక్టర్ సుశీల్ తదితరులు సుకుమార్ వద్దకు వచ్చి మాట్లాడారు. నిరసన విరమించాలని సూచించారు. తాను చెప్పిన వాటికి ఆ డాక్టరమ్మ చేత వివరణ రాయించుకోవాలని అప్పుడే నిరసన విరమించుకుంటానని అతను భీష్మించుకున్నాడు. దీంతో మధ్యాహ్నం వరకు అలాగే నిరసన కొనసాగింది.

పూర్తిస్థాయిలో బెల్టు షాపుల కట్టడి

- నిబంధనలు ఉల్లంఘిస్తే కేసుల నమోదు
- ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాసరావు



మాట్లాడుతున్న డిప్యూటీ కమిషనర్ శ్రీనివాసరావు

నెల్లూరు(క్రైమ్): 'బెల్టు షాపులను ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించవద్దు. నిరంతర దాడులు చేస్తూ వాటి నిర్వాహకులతోపాటు, మద్యం సరఫరా చేసే దుకాణదారులపై సైతం కేసులు నమోదు చేయాలి. పూర్తిస్థాయిలో బెల్టు దుకాణాలను కట్టడి చేయాలి' అని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ టి.శ్రీనివాసరావు అధికారులను ఆదేశించారు. నెల్లూరు బీవీ నగర్‌లోని తన కార్యాలయంలో మంగళవారం ఆయన నెలవారీ నేర సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పొరుగు మద్యం విక్రయాలు, మద్యం అక్రమ రవాణాపై కఠినంగా వ్యవహరించాలన్నారు. నిబంధనల మేరకు దుకాణాల్లో నిర్ణీత వేళల్లోనే మద్యం అమ్మకాలు జరిగేలా చూడాలన్నారు. ఎమ్మార్పీ ఉల్లంఘన, బ్రాండ్ మిక్సింగ్‌లకు పాల్పడేవారిపై కేసులు నమోదు చేయాలన్నారు. ప్రతి దుకాణం వద్ద ధరల పట్టిక ఏర్పాటు చేయించాలన్నారు. సమయపాలన పాటించని బార్లు, మద్యం దుకాణాలపై కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. సారా తయారీ, విక్రయాలు, రవాణాను నిర్మూలించాలని చెప్పారు. గంజాయి అక్రమ రవాణా, విక్రయాలపై దాడులు చేయాలని, పాతనేరస్తుల కదలికలపై నిఘా పెంచాలన్నారు. కల్లు దుకాణాలపై నిరంతర తనిఖీలు నిర్వహించాలని, కల్తీ కల్లు విక్రయాలను అరికట్టాలన్నారు. మాదక ద్రవ్యాల వినియోగం వల్ల వచ్చే ఇబ్బందులపై విద్యాసంస్థల్లో విస్తృతంగా అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. ఎక్సైజ్ కేసుల్లో త్వరితగతిన దర్యాప్తును పూర్తి చేసి నిందితులకు శిక్షలు పడేలా చొరవ చూపాలన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని సిబ్బందిని హెచ్చరించారు. ఈ ఏడాది సెప్టెంబర్‌లో కానిస్టేబుల్ నుంచి హెడ్‌కానిస్టేబుళ్లుగా పదోన్నతి పొందిన వారు డీసీ, ఈఎస్‌ను సత్కరించారు. సమావేశంలో జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి ఎ.శ్రీనివాసనాయుడు, ఏఈఎస్‌లు జె.రమేష్, ఆర్.జగదీశ్వర్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

8న వెనుకబడిన జిల్లాల సదస్సు

కడప సెవెన్‌రోడ్స్ : డిసెంబర్ 8వ తేదీ వెనుకబడిన రాయలసీమ, ప్రకాశం, నెల్లూరు జిల్లాల సదస్సు కడపలో నిర్వహిస్తామని ఉక్కు సాధన ఐక్యవేదిక అధ్యక్షుడు నారాయణ, సీఆర్‌వీ ప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర విభజన జరిగి పదేళ్లయినా విభజన చట్టంలోని కడప స్టీల్ ప్లాంట్ నిర్మాణాన్ని ఇప్పటి వరకు చేపట్టలేదన్నారు. బడ్జెట్‌లో రూ. 25 కోట్లు దీనికి కేటాయించడాన్ని బట్టి చూస్తే రాష్ట్ర ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉందో అర్థమవుతోందన్నారు. స్టీల్ ప్లాంట్ నిర్మాణ బాధ్యత కేంద్రంలోని ఎన్‌డీఏ సర్కార్‌దేనని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అమరావతి నిర్మాణంపై చూపుతున్న శ్రద్ధ వెనుకబడిన జిల్లాలపై లేదని విమర్శించారు.